గరుడ వాహనమెక్కి..



దిగ్గున వెలిగే దీపకాంతులు.. హోరెత్తే గోవిందలు.. గిరిజన నృత్య విన్యాసాలు.. జతగా వాయిద్యాల ఘోష.. 'ఇటు గరుడని నీవెక్కినను.. పటపట దిక్కులు బగ్గన పగిలె' అని అన్నమయ్య వర్ణించినట్టుగానే ఆదివారం రాత్రి తిరుమల కొండమీద గరుడోత్సవం సాగింది. మాడవీధులు భక్తజన సముద్రంగా భాసిల్లాయి. లక్ష్మీకాసుల హారం ధరించిన శ్రీనివాసుడు తన ఇష్టవాహనమైన గరుడుడిని అధిరోహించి గజ, వృషభ దళాలు ముందు నడుస్తుండగా మందగమనంతో విహరించాడు. రాత్రి నుంచే చలిని లెక్కచేయకుండా గ్యాలరీ మెట్లనే పడకలుగా మార్చుకున్న భక్తులు.. పగటి ఎండకు దుప్పట్లకింద తల దాచుకుని గరుడుడిపై ఊరేగుతూ వచ్చే స్వామికోసం ఎదురు చూశారు. ప్రకటించిన సమయంకన్నా 23 నిమిషాల ముందే గరుడవాహన సేవ మొదలైంది. ఉండి ఉండీ కురిసే జల్లుల నడుమ మాడవీధుల్లోని లక్షలాది భక్తజనానికి దర్శనమిస్తూ ముందుకు సాగింది.

సాయంత్రం 6.07 గంటలకు మొదలై.. అర్ధరాత్రి 12.12 గంటలకు ముగిసిన గరుడోత్సవం



23 నిమిషాల ముందే..

సాయంత్రం 6.30 గంటలకు గరుడ సేవ ప్రారంభిస్తామని టీటీడీ ప్రకటించింది. కానీ, ఉదయానికే గ్యాలరీలన్నీ నిండి మాడవీధులు రద్దీగా మారాయి. దీంతో 23 నిమిషాల ముందే.. 6.07 గంటలకే వాహన సేవ ప్రారంభించారు. తొలుత బ్యాడ్జీలు కలిగిన వీఐపీలకు ఉత్సవమూర్తి దర్శనం చేయించి పంపారు. అనంతరం వాహనాన్ని ముందుకు నడిపారు. రాత్రి 12.12 గంటలకు వాహన సేవ ముగిసింది.

2.40 లక్షల మందికి దర్శనం

ఉదయం 11 గంటలకంతా గ్యాలరీలు నిండటతో మాడవీధుల గేట్లను మూసేశారు. సాయంత్రం 4 గంటల సమయానికి 1.90 లక్షల నుంచి 2 లక్షల మంది గ్యాలరీల్లోకి చేరారని అధికారుల అంచనా. మరోవైపు కార్నర్ పాయింట్లు, రీఫిల్లింగ్ ద్వారా మరో 30 వేల నుంచి 35 వేల మంది దర్శనం చేసుకున్నారు. ఇలా, దాదాపు 2.40 లక్షల మందికి గరుడ సేవ దర్శనం లభించింది. మాడవీధుల వెలుపల దాదాపు 30 వేల నుంచి 40 వేల మంది ఉండొచ్చని, మూలవిరాట్టు దర్శనానికి కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు, కృష్ణతేజ సర్కిల్ నుంచి అక్టోపస్ భవనం వరకు మరో 50 వేల మంది చొప్పున దాదాపు 3 లక్షల మందితో తిరుమల నిండిందని టీటీడీ అధికారులు పేర్కొన్నారు. మూలవిరాట్టు దర్శనానికి దాదాపు 36 గంటల సమయం పడుతుండటం గమనార్హం.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం: 8-10మధ్య హనుమంత వాహనం
సాయంత్రం: 4-5మధ్య స్వర్ణ రథోత్సవం
రాత్రి: 7-9 మధ్య గజ వాహనం

'సీబీఎస్'కు పోటెత్తిన భక్తులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గరుడసేవ చూసేందుకు వచ్చిన భక్తులతో ఆదివారం ఉదయం నుంచే తిరుపతి సెంట్రల్ బస్సు స్టేషన్ రద్దీగా మారింది. నిమిషానికో బస్సు వస్తున్నా సరిపోలేదు. బస్సుల్లో సీట్ల కోసం పోటీపడ్డారు. ఇక, కౌంటర్లో ఆరుగురు కండక్టర్లు టిక్కెట్లు జారీచేస్తున్నా భక్తులు క్యూలో బారులు తీరారు. రైల్వేస్టేషన్, విష్ణునివాసం వద్దా ఇదే పరిస్థితి. ఈ రెండు పాయింట్ల వద్దే బస్సులు నిండిపోవడంతో తిరుమల బైపాస్ రోడ్డులో స్థానికులు.. అలిపిరి బాలాజీ బస్టాండులోనూ భక్తులకు నిరీక్షణ తప్పలేదు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం బస్టాండులోనే తిష్టవేసి రద్దీని సమీక్షిస్తూ బస్సులను రప్పించారు. అదనపు మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు అవస్థలు పడ్డారు. సకాలంలో వ్యర్థాలు తొలగించకపోవడంతో కుండీలు నిండి.. దుర్గంధం నెలకొంది. సాయంత్రం 6 గంటల వరకు 88,872 మంది తిరుమలకు వెళ్లగా.. 61,184మంది కొండ దిగారు.



బస్సుల వద్ద పోటీపడుతున్న భక్తులు

2.04 లక్షల మంది

- రాత్రి 11 గంటల వరకు ఆర్టీసీలో ప్రయాణం

గరుడ సేవ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం రాత్రి 11 గంటల వరకు 2,04,090 మంది తిరుమల-తిరుపతి మధ్య ప్రయాణించారు. ఇందులో 1,05,040 మంది తిరుమలకు రాగా, 99,050 మంది కొండ దిగారు. 2011 రికార్డును ఈ ఏడాది అధిగమించడం గమనార్హం. ఆ ఏడాది 1,97,750 మంది భక్తులు అత్యధికంగా ప్రయాణించారు. తిరుమలలో పార్కింగ్ సమస్య నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి ఇతర వాహనాలను ఆపేయడంతో ఆర్టీసీలో ప్రయాణించే వారి సంఖ్య పెరిగినట్టు అధికారులు తెలిపారు.

ఘటాటోపం తీసుకొచ్చే క్రమంలో తోపులాట

వాహన మండపం నుంచి గరుడ వాహనం ప్రారంభమై 7.20 గంటల సమయంలో మహద్వారం వద్దకు చేరుకుంది. అక్కడి హారతి పూర్తయ్యాక ముందున్న గేటు వద్దకు తీసుకొచ్చి నాదనీరాజనం వైపున్న భక్తులకు దర్శనం కల్పించే సమయంలో వర్షం మొదలైంది. వెనకున్న ఘటాటోపాన్ని వాహనం వద్దకు తీసుకొచ్చే సమయంలో కొంతమంది ఉద్యోగులు, భక్తులు దీంతో పాటు రావడంతో భద్రతాసిబ్బంది అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. ఓ బాలిక కింద పడిపోగా.. భద్రతాసిబ్బంది క్షణాల్లో ఆమెను పైకి లేపడంతో ప్రమాదం తప్పింది. వాహనం ముందూ వీఐపీల రద్దీ అధికంగా ఉంది. వాహనంతో పాటే ముందుకు నడుస్తున్న క్రమంలో సమయంలో కొంత గందరగోళం ఏర్పడింది.


24 గంటలకుపైగానే నిరీక్షణ

గరుడ వాహనంపై స్వామిని దర్శించుకునేందుకు 24 గంటలకుపైగానే భక్తులు నాలుగు మాడవీధుల్లో నిరీక్షించారు. శనివారం రాత్రి సర్వభూపాల వాహనసేవ కోసం మాడవీధుల్లోకి చేరిన పలువురు భక్తులు ఆదివారం రాత్రి నాటి గరుడసేవ కోసం అలానే ఉండిపోవడం గమనార్హం. టీటీడీ అందజేసే అన్నపానీయాలు స్వీకరిస్తూ గ్యాలరీల్లోని ఉండిపోయారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

గరుడ వారధిపై ట్రాఫిక్ జామ్

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవారి గరుడ సేవకోసం సుదూర ప్రాంతాల నుంచి వాహనాలు, బస్సుల్లో భక్తులు వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 నుంచి దాదాపు ఐదు గంటల పాటు గరుడ వారధిపై ఎక్కడికక్కడ వాహనాలు ఆగిపోయాయి. మామిడి కాయల మండీ నుంచి ఆర్టీసీ బస్టాండు వద్దకు రావడానికి 45 నిమిషాలు పట్టిందని వాహనదారులు తెలిపారు. ముఖ్యంగా తిరుమలకు వెళ్లే వాహనాలన్నీ గరుడ వారధిపైనే రావడంతో ఆర్టీసీ బస్సులు, కార్లు, టెంపోలు, ద్విచక్ర వాహనాలు ఆగిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు గరుడ సేవ విధుల్లో ఉండటంతో గరుడ వారధిపై ట్రాఫిక్ జామ్ గురించి దృష్టి సారించలేదు. మరోవైపు సాయంత్రం 5 నుంచి మళ్లీ రాత్రి 8 గంటల వరకు గరుడ వారధిపై వాహనాల రాకపోకలు స్తంభించాయి. కొందరు ప్రయాణికులే దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేసుకున్నారు. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులను దించే అలైటింగ్ పాయింట్ గరుడ వారధి కిందనే ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ జామ్ కావడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. పోలీసులు రంగంలోకి దిగి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.



సంతృప్తికరంగా మలయప్ప దర్శనం

మధ్యాహ్నం ఎండకు ఎండుతూ.. సాయంత్రం వర్షానికి తడుస్తూ గరుడ సేవలో మలయప్ప దర్శనానికి భక్తులు అత్యధిక సమయం గ్యాలరీల్లో వేచి ఉన్నారు. దీంతో గ్యాలరీలకు అతి సమీపంలోకి గరుడవాహనాన్ని తీసుకెళ్లి భక్తులకు దర్శనం కల్పించారు. గంటలకొద్దీ వేచిఉన్న భక్తులు కనువిందైన దర్శనంతో సంతృప్తిగా వెనుదిరిగారు. కళాబృందాలూ ఆరు గంటల పాటు నిరంతరాయంగా ప్రదర్శనలతో అలరించాయి. నాలుగు గజరాజులూ ఐదు గంటల పాటు స్వామి వాహనం ముందే నిలబడి సేవ చేశాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఫలించిన పోలీసుల వ్యూహం



గరుడ సేవకు పోలీసుల వ్యూహం ఫలించింది. ముందస్తు ప్రణాళికలతో తోపులాటలు, తొక్కిసలాటలు చోటుచేసుకోలేదు. సాధారణంగా మాడవీధుల్లోని గ్యాలరీలన్నీ నిండిపోయాక మాడవీధుల కార్నర్ పాయింట్ల వద్ద ఏర్పాటు చేసే క్యూలైన్‌లోకి మధ్యాహ్నం నుంచే భక్తులను అనుమతించేవారు. గతేడాది ఇలా వదలడంతో పలు చోట్ల తోపులాటలు జరిగాయి. మరికొందరు గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి అసహనం వ్యక్తం చేశారు. ఈసారి మాత్రం సాయంత్రం 4 గంటల తర్వాతనే ఈ క్యూలైన్లలోకి భక్తులను అనుమతించారు. కేవలం 3 నుంచి 4 గంటలకు నిరీక్షణ సమయం తగ్గిపోవడంతో భక్తులు ప్రశాంతంగా వాహన సేవను దర్శించుకున్నారు. మరోవైపు దాదాపు 6 వేల వాహనాలు తిరుమలకు చేరుకోవడంతో 12 గంటల తర్వాత ఆర్టీసీ బస్సులు మినహా మిగిలిన వాటిని కొండపైకి ఆపేశారు. మధ్యాహ్నంపై ఆర్టీసీ బస్సుల సంఖ్యనూ తగ్గించారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోలేదు.

ఎస్పీ, సీవీఎస్వోను అభినందించిన ఈవో

గరుడ వాహనసేవను విజయవంతంగా పూర్తిచేసిన క్రమంలో ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణను టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ అభినందించారు. పుష్కరిణి వద్ద కుంభహారతి సమయంలో వీరిద్దరిని ఈవో అభినందిస్తూ అభినందనలు తెలిపారు. పక్కా ప్రణాళికలతో స్వామి గరుడవాహనాన్ని ఎలాంటి సమస్యలు లేకుండా ముగించారని కొనియాడారు.



సేవాసదన్ వద్ద సమన్వయ లోపం

అధికారుల మధ్య సమన్వయ లోపంతో శ్రీవారి సేవా సదన్ వద్ద కొందరు భక్తులు ఇబ్బంది పడ్డారు. మాడవీధుల కార్నర్ పాయింట్ల దర్శనానికి ఏటీజీహెచ్, కృష్ణతేజ, బాటగంగమ్మ, అక్టోపస్ భవనం సర్కిల్ వద్ద ప్రవేశ మార్గాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ ప్రవేశించిన వారే కార్నర్ పాయింట్లకు చేరుకుని గరుడవాహనాన్ని దర్శించుకున్నారు. శ్రీవారి సేవాసదన్ వద్ద ఓ ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రవేశించేవారు నేరుగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలోకి చేరుకుంటారు. కొంతమంది భక్తులు ఇది కూడా గరుడవాహన దర్శనం కోసమేనని భావించి వెళ్లారు. దాదాపు రెండుమూడు గంటల తర్వాత ఇది అన్నప్రసాద భవనం క్యూలైన్ అని చెప్పి వారిని బలవంతంగా బయటకు పంపారు. ఈక్రమంలో భక్తులు, పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది.




మధ్యాహ్నం: ఎండకు దుప్పట్లు కట్టుకుని.. - సాయంత్రం: వర్షానికి గొడుగులు పెట్టుకుని..

ఎండా, వానలో..

ఉదయం జరిగిన మోహినీ అవతార సేవలో గ్యాలరీల్లోని భక్తులు ఎండకు తల్లడిల్లిపోయారు. గొడుగులు, తువాళ్లు, దుప్పట్లు అడ్డుగా పెట్టుకుని శ్రీవారి దర్శనం కోసం నిరీక్షించారు. రాత్రి గరుడ సేవలో వర్షానికి కొందరు గొడుగులు, అట్టలు, ప్లాస్టిక్ కవర్లు అడ్డుగా పెట్టుకోగా.. చాలా మంది తడుస్తూనే గ్యాలరీల్లో ఉండిపోయారు. వర్షంలోనూ కళా బృందాలూ ప్రదర్శనలిచ్చాయి.

మాడవీధుల చుట్టూ ప్రదక్షిణలు

ఉదయం 11 గంటలకే గ్యాలరీలు నిండిపోవడంతో భక్తుల ప్రవేశాన్ని నిలిపివేశారు. ఎలాగైనా గ్యాలరీల్లోకి చేరుకోవాలనే తాపత్రయంతో భక్తులు ఒకచోటి నుంచి మరోచోటికి తిరుగుతూ మాడవీధుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

ఆకలికి ఆస్కారం లేకుండా

గ్యాలరీలు, కార్నర్ పాయింట్లలోని భక్తులకు ఆకలి తెలియకుండా టీటీడీ నిరంతరం అన్నప్రసాదాలను అందజేసి ప్రశంసలు అందుకుంది. తాగునీరు, పాలు, మజ్జిగ, పెరుగన్నం, సాంబారన్నం, ఉప్మా, బిస్కెట్లు, సుండలు తదితర ఆహార పదార్థాలను అందించారు. గ్యాలరీల్లోకి వెళ్లలేని కొద్దిమంది మాత్రం తమకు ఆహారం అందలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు.



కొండంతా కార్లే

మధ్యాహ్నం సమయానికే సుమారు ఆరువేల వాహనాలు తిరుమలకు చేరుకున్నాయి. దీంతో పార్కింగ్ కనబడని పరిస్థితి నెలకొంది. కొండపై ఎటు చూసినా కార్లే కనిపించాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి




భక్తులు దూసుకురావడంతో రాంభగీచా వద్ద విరిగిన గేటు - రాంభగీచా వద్ద భక్తుల మధ్య తోపులాట

రాంభగీచ వద్ద తోపులాట, విరిగిన గేట్లు

గరుడ సేవ చూసి తిరిగొచ్చేవారు.. వాహనాన్ని చూడాలనే తాపత్రయంతో దూసుకొచ్చిన వారు.. ఇలా రాంభగీచ-2 వద్ద భక్తుల మధ్య స్వల్పతోపులాటలు చోటుచేసుకున్నాయి. ఇనుపగేటు విరిగిపోయింది. అదృష్టవశాత్తు భక్తులెవ్వరికి ఎలాంటి గాయాలు కాలేదు. ఓ యువతి కళ్లుతిరిగి పడిపోయింది. సప్తగిరి ఎంట్రీ పాయింట్ వద్ద స్వల్పంగా తోపులాట చోటుచేసుకుంది. సర్వదర్శనంకెళ్లే భక్తులు, మాడ వీధుల కార్నర్స్ పాయింట్లకు వెళ్లే భక్తులు ఒకేసారి రావడంతో నందకంవద్ద కూడా స్వల్పంగా తోపులాట చోటుచేసుకుంది. లడ్డూ కౌంటర్ వద్ద కొంత మంది భక్తులు వాహనసేవకు అనుమతించాలంటూ నిరసన వ్యక్తంచేశారు. నిమిషాల వ్యవధిలోనే భద్రతా సిబ్బంది వచ్చి సర్దిచెప్పి పంపించేశారు.

మనోనేత్రంతో గరుడవాహన దర్శనం

చూడటానికి కళ్లులేకపోయినా మనోనేత్రంతో శ్రీవారి గరుడ వాహనాన్ని వీక్షించారు హైదరాబాద్‌కు చెందిన అంధులు. 'వికలాంగుల కల్యాణవేదిక బ్లైండ్ గర్ల్స్ హాస్టల్' నుంచి సుభాష్ గుప్తా ఆధ్వర్యంలో ఐదుగురు అంధులు ఆదివారం రాత్రి జరిగిన గరుడ సేవలో పాల్గొన్నారు. వీరికి పాసులు లేకపోయినా పోలీసులు వాహనం ముందుకు అనుమతించారు. 'నేను యూనియన్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగిని. ఏటా గరుడోత్సవంలో పాల్గొంటున్నా. నాకు కళ్లు లేకపోయినా చెవుల ద్వారా హృదయంలో శ్రీవారి రూపం కనిపిస్తోంది' అని సుభాష్ గుప్తా 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.





శ్రీవారిమెట్టు వద్ద అన్నదానం చేస్తున్న గోవిందా సేవా మండలి సభ్యులు

శ్రీవారిమెట్టు నుంచీ కొండకు..

చంద్రగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం శ్రీవారిమెట్టు దారిలోనూ ఉదయం నుంచీ భక్తులు కాలినడకన తిరుమల వెళ్లారు. శ్రీవారి మెట్టు మార్గంలో పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు అన్న ప్రసాదాలు, మజ్జిగ, పంపిణీచేశారు. శ్రీవారిమెట్టు వద్ద గోవిందా సేవా మండలి ఆధ్వర్యంలో నిత్యాన్నదానం నిర్వహించారు. శనివారం 13 వేల మందికిపైగా భక్తులు కాలినడకన ఈమార్గంలో తిరుమల వెళ్లినట్లు అధికారులు తెలిపారు. టీటీడీ విజలెన్స్ సెక్యూరిటీతో పాటు చంద్రగిరి సీఐ ఇమ్రాన్‌బాషా, ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, భక్తవత్సలం, మురళీమోహన్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

శ్రీవారి సేవలో..




ఆదివారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని వస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నటి వరలక్ష్మి

గరుడోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి

ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఆదివారం తిరుమలలో జరిగిన గరుడవాహనసేవలో పాల్గొన్నారు. వాహనం మధ్యలో ఉత్సవమూర్తిని దర్శించుకున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా రాత్రి గరుడవాహనసేవలో పాల్గొన్నారు.

కన్నులపండువగా కల్యాణ వెంకన్న గరుడోత్సవం



గరుడుడిపై విహరిస్తున్న మలయప్పస్వామి, సారె సమర్పిస్తున్న పేరూరు గ్రామస్తులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడోత్సవం ఆదివారం రాత్రి కన్నుల పండువగా సాగింది. పట్టువస్త్రాలు, స్వర్ణ ఆభరణాలు, విశేష పుష్పాలంకరణతో ముస్తాబైన స్వామివారు గరుడుడిపై మలయప్పస్వామిగా కొలువుదీరి భక్తులను అనుగ్రహించారు. వాహనసేవ ముందు కళాకారుల సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కాగడాలు ప్రత్యేక ఆకర్షణగా నిలచాయి. గరుడసేవ ప్రారంభానికి ముందు ఇస్కాన్ ఆలయం నుంచి ఉపాధ్యక్షులు రూపేశ్వర చైతన్య ప్రభుదాస్, కార్యదర్శి బలబద్ర ప్రభు ఆధ్వర్యంలో స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు.

వాహనాలన్నీ తిరుపతిలోనే..





గరుడ సర్కిల్ వద్ద కార్లు తిరుమలకు వెళ్లకుండా వెనక్కి పంపుతున్న అలిపిరి సీఐ - కపిలతీర్థం సర్కిల్‌వద్ద ట్రాఫిక్ మళ్లిస్తున్న అలిపిరి ఎస్ఐ అజిత

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గరుడ సేవకు సొంత, అద్దె వాహనాల్లో భక్తులు భారీగా వచ్చారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 11 గంటలకే తిరుమలలో పార్కింగ్ ప్రదేశాలన్నీ నిండిపోయాయి. అప్పట్నుంచి ఆర్టీసీ బస్సులు మినహా మిగిలిన వాహనాలన్నింటినీ తిరుపతిలోని నంది.. గరుడ సర్కిళ్ల వద్ద నిలిపేశారు. టీటీడీ, పోలీసు వాహనాలను సైతం కొండకు అనుమతించ లేదు. ఉన్నపళంగా తిరుమలకు వాహనాలను అనుమతించకపోవడంతో అలిపిరి వద్దకు వచ్చిన భక్తులు ఇబ్బంది పడ్డారు. ముందుగా చెప్పకుండా ఎలా ఆపుతారంటూ తమిళనాడుకు చెందిన భక్తులు, టీటీడీ ఉద్యోగులు గరుడ సర్కిల్ వద్ద విధి నిర్వహణలో వున్న ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాసులుతో వాగ్వివాదానికి దిగారు. చివరకు వీరంతా అలిపిరి లింక్ బస్టాండు నుంచి ఆర్టీసీ బస్సుల్లో కొండకు వెళ్లారు. ఈ వాగ్వాదంతో సప్తగిరి తనిఖీ కేంద్రం నుంచి గరుడ సర్కిల్ వరకు ట్రాఫిక్ నిలిచిపోయింది. రోగిని రుయాస్పత్రికి తీసుకెళుతున్న 108 వాహనం కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుంది. రోగి సహాయకురాలు కిందకు దిగి ఆందోళన వ్యక్తం చేయడంతో ఆర్టీసీ సిబ్బంది బస్సులను పక్కకు పంపి అంబులెన్సుకు దారి కల్పించారు.

భక్తుడిపై పోలీసుల దాడి

తిరుమల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గరుడవాహనం మాడవీధులు చుట్టుకుని తిరిగి తూర్పుమాడవీధికి చేరుకున్న సమయంలో వెనుకభాగం నుంచి కొందరు భక్తులు వాహనం వద్దకు చేరుకునే ప్రయత్నం చేశారు. రోప్ కింద నుంచి వచ్చే ప్రయత్నం చేసిన ఓ భక్తుడిపై ఇద్దరు పోలీసులు చేయిచేసుకున్నారు. దీంతో భక్తుడి బంధువులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దేవుడిని చూడటానికి వస్తూ దాడి చేస్తారా అంటూ మండిపడ్డారు. పోలీసు అధికారులు జోక్యం చేసుకుని భక్తులకు నచ్చజెప్పి పంపారు.



హంస వాహనంపై మూలస్థాన ఎల్లమ్మ



నేంద్రగుంట మూలస్థానమ్మ



విశాలాక్షి అలంకారంలో కామాక్షి అమ్మవారు



దుర్గాదేవిగా చాముండేశ్వరి

హంస వాహనంపై సరస్వతీదేవిగా ఎల్లమ్మ

చంద్రగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆదివారం రాత్రి సరస్వతీ అలంకరణలో హంస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించారు. విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి సరస్వతీ అలంకరణ చేసి హంస వాహనంపై చంద్రగిరి పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఉభయదారులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. మిట్టమీద గంగమ్మ ఆలయంలో అభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని నారాయణీ అలంకరణలో గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయ ఆవరణలోని సంతోషిమాత దుర్గాదేవి సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరాదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తి షష్టి దుర్గగా కాత్యాయని అలంకరణ చేసి, ఆలయ ఆవరణలో కొలువుదీర్చారు. భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి పాల్గొన్నారు.

మహాచండీదేవిగా నేంద్రగుంట మూలస్థానమ్మ

పాకాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేంద్రగుంట మూలస్థానమ్మ దేవి ఆదివారం మహాచండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం వినాయక, నవగ్రహాల పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేసి, ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కుంకుమార్చన చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, నేంద్రగుంట గ్రామస్తులు పాల్గొన్నారు.

విశాలాక్షిగా కామాక్షి అమ్మవారు

రామచంద్రాపురం, (ఆంధ్రజ్యోతి): రాయలచెరువుకట్ట భవాని జలకంఠేశ్వరాలయంలోని ఉపాలయాల్లో వెలసిన మహాలక్ష్మి అమ్మవారు, భవాని అమ్మవారు, కామాక్షి అమ్మవారు ఆదివారం విశాలాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు. విశేషపూజలు నిర్వహించి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేపట్టారు.పాలకాల్వ రాజరాజేశ్వరి పీఠంలో వెలసిన అమ్మవారు విశాలాక్షిఅమ్మవారుగా భక్తులకు దర్శనమిచ్చారు. బాలాజీ స్వామి, ఉభయదాత అబ్బూరు దేవరాజులునాయుడు దంపతులు పాల్గొన్నారు.

కామాక్షిదేవిగా మూలస్థాన ఎల్లమ్మ దుర్గాదేవిగా చాముండేశ్వరి

తిరుపతిరూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట చెంచువారికాలనీలోని మూలస్థాన ఎల్లమ్మ ఆదివారం కామాక్షిదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. ఉదయం అభిషేకం, హోమం, విశేషాలంకరణ నిర్వహించారు. ఉభయదారులుగా బిరుదాల హనుమంతరెడ్డి, జయసుధ దంపతులు, సాయిరాంరెడ్డి, మౌనిక, తేజస్వరూప్‌రెడ్డి, కరాంచ్‌రెడ్డి, అనూష, మోహన్‌రెడ్డి, ఖ్యాతి, భరత్‌కుమార్‌రెడ్డి, వాణి వ్యవహరించారు. కాగా హనుమంతరెడ్డి దంపతులు అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బిరుదాల సిద్దారెడి పాల్గొన్నారు.

దుర్గాదేవిగా చాముండేశ్వరీదేవి : తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి దుర్గాదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, హోమం, విశేషాలంకరణ, అన్నదానం చేశారు. ఉభయదారులుగా బి.లోకేష్‌యాదవ్, వై.దిలీప్‌కుమార్, వై.హేమాద్రి, రామకృష్ణమనాయుడు, సునీత, సుధాకర్, ఉషారాణి, రామమోహన్‌సింగ్, గీతా, జయపాల్‌నాయుడు, నాగమణి, అనిత, హిమగిరి వ్యవహరించారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

పాకాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని బహుజన అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు జి.ఆంజినేయులు డిమాండు చేశారు. స్థానిక ఎస్వీఎన్ పాఠశాలలో ఆదివారం బీటీఏ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పీఆర్సీ, డీఏలు సకాలంలో చెల్లిస్తామని, బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా పట్టించుకోకపోవడం తగదని అన్నారు.

పార్కింగ్ ప్రదేశాలన్నీ ఫుల్



అలిపిరి వద్ద పార్కింగ్‌లో ద్విచక్ర వాహనాలు

తిరుపతి(నేరవిభాగం) : తిరుమలకు ప్రైవేటు వాహనాలను ఆపేయడంతో తిరుపతిలోని దాదాపు 10 పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు ఆపారు. మధ్యాహ్నం 1 నుంచి 2 గంటలకే అన్ని పార్కింగ్ ప్రదేశాలు వాహనాలతో కిక్కిరిసి పోయాయి. ద్విచక్ర వాహనాలు సైతం పార్కింగ్ చేయలేనంతగా నిండిపోయాయి. అలిపిరి సమీపంలోని ప్రయివేటు బస్సుల పార్కింగ్ ప్రదేశంలో తమిళనాడు రిజిస్ట్రేషన్ బస్సులే ఎక్కువగా కనిపించాయి. ఇక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండు, దేవలోక్, మామిడి కాయల మండీ పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు అడ్డదిడ్డంగా ఆపేయడంతో భక్తులు ఇబ్బంది పడ్డారు.

సుబ్రమణ్యంనాయుడి మృతి పార్టీకి తీరని లోటు

నివాళులర్పించిన ఎమ్మెల్యేలు, నాయకులు



సుబ్రమణ్యంనాయుడు కర్మక్రియలకు హాజరైన ఎమ్మెల్యేలు నాని, జగన్మోహన్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు సీఆర్ రాజన్, మబ్బు దేవనారాయణరెడ్డి తదితరులు

చంద్రగిరి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్ సుబ్రమణ్యం నాయుడు మృతి టీడీపీకి తీరని లోటని ఎమ్మెల్యేలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అన్నారు. ఆదివారం పనపాకం పంచాయతీ గడ్డంవారిపల్లెలో సుబ్రమణ్యంనాయుడి కర్మక్రియలు నిర్వహించారు. సంతాప సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యేలు పులివర్తి నాని, గురజాల జగన్మోహన్, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్, నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినీల్, నాయకులు, కార్యకర్తలు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. పార్టీకి సుబ్రమణ్యంనాయుడు చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

చికాగోలో దేవిరెడ్డి పుస్తకం ఆవిష్కరణ



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న చికాగా కుక్ కౌంటీ కమిషనర్ కెవిన్ మొరిసన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని చికాగోలో ఎస్వీయూనివర్సిటీ చరిత్ర విభాగ విశ్రాంతాచార్యుడు దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి రాసిన 'లాస్ అండ్ గెయిన్ ఇన్ బ్రిటీష్ ఇండియా (ఆంగ్లేయుల పాలనలో భారత దేశానికి జరిగిన లాభ నష్టాలు)' అనే పుస్తకావిష్కరణ జరిగింది. చికాగో సాహితీ మిత్రులు షాంబర్గ్ పబ్లిక్ లైబ్రరీలో శనివారం(ఇండియాలో ఆదివారం) ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చికాగో కుక్‌కౌంటీ కమిషనర్ కెవిన్ మొరిసన్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. మెట్టుపల్లి జయదేవ్, తిమ్మాపురం ప్రకాష్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షుడు జంపాల చౌదరి, డా.రవీంద్రనాథరెడ్డి వంటి తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు. సభనుద్దేశ్యించి దేవిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి మాట్లాడుతూ, భారత దేశం అంతర్జాతీయ విజ్ఞాన కేంద్రమని అన్నారు. ప్రపంచ పారిశ్రామిక ఉత్పత్తుల్లో ఇరవై ఐదు శాతం ఉత్పత్తి చేయగల గొప్ప శక్తిని భారతదేశం ఎప్పటి నుంచో కలిగి ఉందన్నారు. రెండు వేల సంవత్సరాల పాటు గొప్పగా భారత దేశం వెలిగిందన్నారు. బ్రిటీష్ పాలనలో 1765-1900 మధ్య 165 ట్రిలియన్ డాలర్ల నగదు ఇంగ్లాండుకు తరలి పోయిందని అన్నారు.

సమాజ మార్పునకు శక్తి ఇచ్చిన జాషువా సాహిత్యం


జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాపూరి ప్రసాద్

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంతో ప్రజల సమస్యలను వెలుగెత్తి చాటిన మహాకవి, సంఘ సంస్కర్త గుర్రం జాషువా అని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రాపూరు ప్రసాద్‌బాబు పేర్కొన్నారు. ఆదివారం జాషువా జయంతిని పురస్కరించుకుని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్, మాదిగ జనసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మాదిగా, కాటయ్య, ప్రభు, అర్జున్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్ వేయించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంపుడు జంతువులకు తప్పనిసరిగా రేబిస్ వ్యాక్సిన్ వేయించాలని, ఈ వ్యాధి చాలా ప్రమాదకరమని డీఎం హెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రేబిస్ ఎక్కువగా కుక్కల నుంచి వచ్చే అవకాశాలున్నాయని, అందుకే వాటితో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరముందని తెలిపారు. కుక్క కరిచినా, వాటి పంటి, గోటితో గాయపరిచినా వెంటనే ప్రథమ చికిత్స చేయించుకోవాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీఎస్వో మురళీకృష్ణ, డాక్టర్లు స్వరూప్, లావణ్య పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించాలి


మాట్లాడుతున్న శ్రీకాంత్, దయాకర్

తిరుపతి రూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు ఎనలేనివని, విద్యార్థులకు చదువుతోపాటు సేవాభావాన్ని పెంపొందించుకోవాలని హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కమిషనర్ తుంగా శ్రీకాంత్, చైర్మన్ పుల్లూరు దయాకర్ పేర్కొన్నారు. ఎమ్మార్‌పల్లె యూత్‌హాస్టల్‌లో ఆదివారం సంఘ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అకడమిక్ విద్యతోపాటు బోధించాల్సిన నూతన అంశాలు, ధ్రువపత్రాల పంపిణీ వంటి వాటిని వివరించారు. సంఘ అభివృద్ధికి జిల్లా అధికారులు, మాస్టర్స్, గైడ్ల సలహాలు తీసుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా సంబరాల్లో భాగంగా ఆదివారం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. చెన్నైకి చెందిన జతిలయ డ్యాన్స్ అకాడమీకి చెందిన పుష్పవాణి తులసీరామన్ తన శిష్యబృందంతో కలిసి పలు భక్తి గీతాలకు నృత్య ప్రదర్శన చేశారు. వారికి శిల్పారామం ఏవో సుధాకర్ జ్ఞాపికలు అందజేశారు. ఫీల్డ్ సూపర్‌వైజర్ సూర్యతేజ, ఏఈ రాధాకృష్ణ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఆంత్రోపాలజీ పరిశోధ కుడు ఎన్.రాంబాబు డాక్టరేట్ పొందారు. ఏ స్టడీ ఆన్ హెల్త్ స్టేటస్ అమాంగ్ టూ ట్రైబల్ పాపు లేషన్స్ ఆఫ్ కర్నూలు డిస్ట్రిక్ట్ యాన్ ఆంత్రో పాలజికల్ స్టడీ అంశంపై ప్రొఫెసర్ చంద్రశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.


రాంబాబు

వృద్ధులు యువతకు మార్గదర్శకులు


వృద్ధులకు చేతికర్రలు అందజేస్తున్న దాతలు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వృద్ధులు ఒంటరి వారు కాదని, యువతకు మార్గ దర్శకులని, వారి అనుభవం, జ్ఞానం సమాజానికి విలువైన సంపదలని రాస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజనాయుడు, మారుతి ఆస్పత్రి అధినేత మారుతి అన్నారు. మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో గల ఆశ్రమంలో రాస్ ఆధ్వర్యంలో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వృద్ధుల సూచనలు, సలహాలతో భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చేతికర్రలు, బహుమతులు ఇచ్చారు. విందుభోజనం ఏర్పాటు చేశారు. జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా వ్యక్తిత్వ వికాస నిపుణులు బాబు, వృద్ధాశ్రమం డైరెక్టర్ యువరాజులనాయుడు, ఆశ్రమ నిర్వాహకులు కరుణాకర్‌నాయుడు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 30న తిరుపతి ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టనున్న నిరసన కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వైసీపీ ఎస్సీ విభాగం నాయకుడు తలారి రాజేంద్ర కోరారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు.

సర్వే అకాడమి భూములను రక్షించండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం, మంగళం పరిసర ప్రాంతాల్లో ఉన్న సర్వే అకాడమి, ఇతర ప్రభుత్వ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి డిమాండ్ చేశారు. తిరుమలనగర్ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 195-1లో ఖాళీగా ఉన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను అధికార పార్టీ నాయకులు ఆక్రమిస్తుంటే రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయానికి దగ్గర్లో ఉన్న భూములకు రక్షణ లేకపోతే మిగతా వాటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. కలెక్టర్ వెంకటేశ్వర్ స్పందించాలని కోరారు.

తిరుపతి

వారాహిదేవిగా తాతయ్యగుంట గంగమ్మ


తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మూలవిరాట్టు, ఉత్సవమూర్తికి వారాహిదేవి అలంకారం - మహాచండీదేవి అలంకారంలో పాత మున్సిపల్ ఆఫీసు సమీపంలోని నడివీధి గంగమ్మ - శివలింగ అలంకరణలో లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారి మూలవిరాట్టుకు ఉదయం విశేష అభిషేకాలు, పూజలు చేశారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. వారాహిదేవి అలంకారం చేసి, కుంకుమార్చన నిర్వహించారు. హోమ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. పాలకమండలి చైర్మన్ నైనారు మహేష్ యాదవ్, సభ్యులు, ఈవో జయకుమార్ పాల్గొని, పూజాద్రవ్యాలను సమర్పించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తికి వారాహిదేవి అలంకారం చేసి, ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దివ్య దర్శనంతో పులకించిపోయారు. అలాగే పల్లివీధిలోని వేశాలమ్మ ఆలయంలో మామిడి సేవ వైభవంగా నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుడు అలంకారం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని పెద్దగంగమ్మ ఆలయంలోనూ అమ్మవారికి పార్వతీ పరమేశ్వరుల అలంకారం చేశారు. పాత మున్సిపల్ ఆఫీసు అనుకుని ఉండే నడివీధి గంగమ్మకు మహాచండీదేవి అలంకారం చేశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కపిలేశ్వరస్వామి ఆలయంలోని కామాక్షి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. మహాలక్ష్మీదేవి అలంకారం చేసి భక్తాదులకు దర్శనం కల్పించారు.

వారాహి అలంకరణలో వాసవి కన్యకాపరమేశ్వరి

తిరుపతి అర్బన్, (ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం కూడలి అన్నపూర్ణదేవి ఆలయంలో ఆదివారం రాత్రి అమ్మవారు శివలింగ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలోని మూలమూర్తి సూర్యకళదేవిగా, ఉత్సవమూర్తి వారాహి అలంకరణలో కటాక్షించారు.

భువనేశ్వరిదేవిగా బొంతాలమ్మ

తిరుపతి(జీవకోన), (ఆంధ్రజ్యోతి): కరకంబాడీ రోడ్డులోని బొంతాలమ్మ ఆలయంలో అమ్మవారు ఆదివారం భువనేశ్వరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.


హోమ పూజల్లో పూజా ద్రవ్యాలను సమర్పిస్తున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పాలకమండలి సభ్యులు - వారాహి అలంకరణలో కొత్తవీధి వాసవి కన్యకాపరమేశ్వరి - భువనేశ్వరిదేవి అలంకరణలో కరకంబాడీ రోడ్డులోని బొంతాలమ్మ

షర్మిల హిందువులకు క్షమాపణ చెప్పాలి

- చంద్రబాబు ఆర్‌ఎస్‌ఎస్ వాదిలా మారాడన్న వ్యాఖ్యలు బాధాకరం
- టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆర్ఎస్ఎస్ వాదిలా మారిపోయారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల అనడం సరికాదని, ఈ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నేత, టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దళితవాడల్లో 5 వేల ఆలయాలను నిర్మిస్తామని సీఎం ఇటీవల తిరుమలలో ప్రకటించడాన్ని ఉటంకిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఈ మేరకు ఆదివారం భానుప్రకాష్‌రెడ్డి ఓ వీడియో విడుదల చేశారు. రాష్ట్రంలోని దళితవాడల్లో ఆలయాలు నిర్మించాలని సీఎం మంచి నిర్ణయం తీసుకున్నారన్నారు. అయితే హిందూ వ్యతిరేకి, హిందూ ధర్మాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తున్న షర్మిల దీన్ని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఆలయాల నిర్మాణ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలన్న వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని చెప్పారు. ఆమె ఏ రోజన్నా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారా? ఎప్పుడైనా తిరుమల మెట్లెక్కారా అని నిలదీశారు. హిందూ ధర్మంపై నమ్మకం లేకపోతే జరూసలేంకు వెళ్లాలని హితవుపలికారు. దేశం, ధర్మం కోసం పని చేసే ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శించే స్థాయి మీకు లేదని ఎద్దేవా చేశారు. షర్మిల తక్షణం హిందువులకు క్షమాపణ చెప్పాలని కోరారు.

గరుడసేవ భక్తులకు విరివిగా అన్నదానం


అన్నదానం చేస్తున్న డిస్కం సీఎండీ సంతోషరావు - అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస నిర్వాహకులు

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవ తిలకించేందుకు తిరుమలకు వెళుతున్న భక్తులకు విద్యుత్ ఉద్యోగులు మజ్జిగ, అన్నదానం చేయడం శుభపరిణామమని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోష రావు అన్నారు. తిరుచానూరు రోడ్డులోని విద్యుత్ ఉద్యోగుల ట్రైనింగ్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో ఆయన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. 20 ఏళ్లుగా ఉద్యోగులు అన్నదానం చేయడం సంస్థకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కృష్ణారెడ్డి, ఎస్ఈ చంద్రశేఖరరావు, దేవేంద్రరెడ్డి, వేణుగోపాల్, శ్రీధర్, అంజనప్ప, వి.గోపి ఉద్యోగులు పాల్గొన్నారు.

● అలిపిరి వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి శ్రీశ్రీనివాస వారి ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం శ్రీవారి భక్తులకు అన్నదానం చేశారు. పండ్లు పంపిణీ చేశారు. నాయకులు ఆర్కాట్ క్రిష్ణప్రసాద్, బెల్లంకొండ సురేష్, శాంతి నాడార్, శేషాద్రి, జీవన్ పాల్గొన్నారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి


జాషువా పురస్కారాలు ప్రదానం చేస్తున్న రంగస్థలి నిర్వాహకులు - జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రుద్రకోటి సదాశివం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో ఆదివారం కవి సామ్రాట్ గుర్రం జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమూరి సుబ్రహ్మణ్యంరెడ్డి, కన్నప్పగారి కేశవులు, ప్రముఖ మిమిక్రీ కళాకారుడు శాంబోలా హరినాథ్‌కు జాషువా పురస్కారాలను అందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, కార్యదర్శి కెఎన్.రాజా, సభ్యులు పాల్గొన్నారు. అలాగే చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో జరిగిన వేడుకల్లో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, మల్లికార్జున్, శంకర్, సుశీలమ్మ తదితరులు పాల్గొని జాషువా చిత్రపటానికి నివాళి అర్పించారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్స్ వితరణ



తిరుపతి(విద్య), సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంజయ్‌గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు తేజో చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ల్యాప్‌టాప్స్ వితరణ చేశారు. సంస్థ అధినేత డాక్టర్ జిడ్డు సూర్యసుబ్రమణ్యం ల్యాప్‌టాప్స్‌ను హెచ్ఎం ఎం.మునిశారదకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు తోడ్పాటునందిస్తామన్నారు. సంస్థ ప్రతినిధిని హెచ్ఎం అభినందించారు.

జాతీయ గ్రాప్లింగ్ పోటీలకు చరిష్మారెడ్డి



తిరుపతిరూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం అడపారెడ్డిపల్లెకి చెందిన పట్టాభిరెడ్డి కుమార్తె మద్దేరి చరిష్మారెడ్డి జాతీయ స్థాయి గ్రాప్లింగ్-రెజ్లింగ్ పోటీలకు ఎంపికైంది. సత్యసాయి జిల్లా గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో హిందూపురం ఎంజీఎం హైస్కూల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి 5వ జూనియర్ అండ్ సీనియర్ బాలుర, బాలికల గ్రాప్లింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. నవంబరులో అయోధ్యలో నిర్వహించనున్న పోటీలలో ఆమె పాల్గొననుంది.

జీవితానుభవాలకే కవితారూపమిచ్చా



ఉగ్గుపాలనుండే కవితా సంపుటి పుస్తక పరిచయ సభలో పాల్గొన్న ప్రముఖులు

చెన్నై, సెప్టెంబర్ 28 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవనంలో ఆదివారం ఉదయం 'జనని సమితి' ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి వేడుకలను నిర్వహించారు. తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రమణ్యం రచించిన 'ఉగ్గుపాలనుండే' అనే కవితా సంపుటిని సభలో ఆవిష్కరించారు.అరసం తిరుపతి జిల్లా కార్యదర్శి డాక్టర్ నెమిలేటి కిట్టన్న పుస్తకాన్ని సమీక్షిస్తూ పేరూరు బాలసుబ్రమణ్యం రైతు జీవన స్థితిగతులను, సామాజిక పరిస్థితులను తన కవితా వస్తువులుగా తీసుకోవడం సంతోషదాయకమన్నారు. రచయిత బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ, తాను అనుభవించిన జీవితాన్ని కవితల రూపంలో తీసుకొస్తున్నానని, జనని సంస్థ తన పుస్తక పరిచయ సభను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో అరసం తిరుపతి జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, అరసం తిరుపతి జిల్లా రచయితల సంఘం కార్యదర్శి మన్నవ గంగాధర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న జీఎస్టీ తగ్గింపు నిర్ణయంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. అంతేగాక నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రవాణా చార్జీలు తగ్గుతాయని, తద్వారా సామాన్య ప్రజలకు ఉపశమనం కలుగుతుందని వివరించారు. అదే సమయంలో గత ప్రభుత్వంలో ప్రజలపై మోపిన ట్రూ ఆప్ చార్జీల తగ్గింపుతో వినియోగదారులకు ఊరట కలిగించిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విస్తరణాధికారిగా షణ్ముగం


షణ్ముగాన్ని సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విస్తరణాధికారిగా ఏరువాక ఫౌండేషన్ నుంచి డీపీఎం షణ్ముగం అవార్డు అందుకున్నారు. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో 26, 27 తేదీలలో నిర్వహించిన ఏరువాక కిసాన్ మహోత్సవం-2025లో ఎమ్మెల్సీ సోము వీర్రాజు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ప్రకృతి వ్యవసాయంలో మహిళా భాగస్వామ్యంతో రైతులను చైతన్యవంతులను చేయడమేగాక తక్కువ ఖర్చుతో నిరంతర ఆదాయం వచ్చే సాగు విధానాలపై అవగాహన కల్పించినందుకు షణ్ముగంను అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగ్రి మిషన్ వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, జీడీసీఎంఎస్ చైర్మన్ హరిబాబు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తల కోసం డిజిటల్ బుక్


క్యూఆర్‌కోడ్‌ను ప్రదర్శిస్తున్న వైసీపీ నేతలు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్తల కోసం ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్ తీసుకొచ్చిన డిజిటల్ బుక్‌ను మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి నివాసం వద్ద నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి అధ్యక్షతన ఆదివారం క్యూఆర్ కోడ్‌ను ప్రారంభించారు. అన్యాయానికి గురవుతున్న పార్టీ కార్యకర్తల కోసమే దీన్ని రూపొందించినట్లు తెలిపారు.

భక్తులకు అన్నదానం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి గరుడసేవ సందర్భంగా ఆదివారం అలిపిరి గరుడ సర్కిల్ రోడ్డులోని వాల్మీకి ఆలయం వద్ద స్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సంస్థ అధ్యక్షులు దుర్గాబాబు, ఉప్పలపాటి శ్రీనివాస చౌదరి, ఉపాధ్యక్షులు తుంగా వెంకటేశ్వర్లు, ఓపీ చౌదరి అన్న ప్రసాదాలు, మజ్జిగ, నీరు, వివిధ రకాల తినుబండారాలను పంచి పెట్టారు. ఏటా గరుడ సేవ రోజు అన్న ప్రసాదాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రామచంద్ర నాయుడు, తుంగా మోహన్, డీకే రాజు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె పదిలం: ఆర్డీవో



3కే రన్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వ్యాయామంతో మంచి ఆరోగ్యం పొందవచ్చని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఎంజీఎం ఆస్పత్రి ఆధ్వర్యంలో 3కే రన్ జరిగింది. ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాయామంతోగుండెను పదిలంగా ఉంచుకోవచ్చన్నారు. ఎంజీఎం ఆస్పత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాలుగా రన్ శ్రీకాళహస్తి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తమ ఆస్పత్రిలో గుండె సంబంధి ఓపీ పూర్తిగా ఉచితమన్నారు. 28, 29, 30వ తేదీల్లో 50శాతం రాయితీతో ఈసీజీ, 2డీ, వంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ భవానీ ప్రసాద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాజేంద్రప్రసాద్‌కు కళానందేశ్వర అవార్డు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన డోలు విద్వాంసుడు కూరపాటి రాజేంద్రప్రసాద్ కళానందేశ్వర అవార్డు అందుకున్నారు. విజయవాడలో ఆదివారం వాగ్దేవి వాయిద్య సంగీత కళ నృత్య సంస్కృత సంస్థ 5వేలమందితో కళా ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సినీనటుడు శుభలేఖ సుధాకర్ చేతుల మీదుగా రాజేంద్రప్రసాద్ కళానందేశ్వర అవార్డు అందుకున్నారు. ఈయనను నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు శ్రీహరి, కృష్ణమూర్తి, కొత్తపట్నం మహేంద్ర, వడ్లపూడి వెంకయ్య, చల్లగుండ్ల వెంకటముని అభినందించారు.

బంగారమ్మ ఆలయంలో మహాచండీ హోమం



ఏర్పేడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మర్రిమందలో శ్రీలక్ష్మీ హయగ్రీవ స్వామి ఆలయ ఆవరణలోని బంగారమ్మ గుడిలో ఆదివారం మహాచండీ హోమం వైభవంగా నిర్వహించారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాచండీ హోమం నిర్వహించినట్లు ఆలయ కమిటీకి చెందిన గిరిప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సీఎం సహాయనిధి అందజేత



బాధితులకు చెక్కులను అందజేస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ పలువురు బాధితుల ఇళ్లకు వెళ్లి సీఎం సహాయనిధిని అందజేశారు. పలువురు అనారోగ్య బాధితులకు సహాయం చేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సీఎం చంద్రబాబునాయుడిని కోరారు. ఆయన సీఎం సహాయనిధిని మంజూరుచేశారు. ఈమేరకు ఆదివారం బృందమ్మ 18మందికి రూ.11,33లక్షల మేర చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు పేట బాలాజీ, గాదిపాకుల గోపీనాథ్, షాకీరాలీ, అస్మత్, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కేటీ రోడ్డుపై గుంతలతో ఇబ్బందులు



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి-తడ రోడ్డులోని కాటూరు బ్రిడ్జిపై గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వర్షాలతో బ్రిడ్జిపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీకటి పడితే గోతులు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విద్య ప్రాముఖ్యతపై పిల్లలకు అవగాహన

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎర్రంరెడ్డిపల్లి, ఓబులాయపల్లి గ్రామాల్లో ఆదివారం ప్రగతి స్వచ్ఛంద సంస్థ బాల బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సంస్థ సమన్వయకర్త చంద్రశేఖర్ మాట్లాడుతూ బడి ఈడు పిల్లందరూ బడిలో ఉండాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కరపత్రాలను ఆవిష్కరించారు.

మీనాక్షి దేవి అలంకరణలో అవనాక్షమ్మ



మీనాక్షి దేవి అలంకరణలో అవనాక్షమ్మ




మహాచండిగా సర్వమంగళాదేవి

నారాయణవనం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): అవనాక్షమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారిని మీనాక్షిదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం అవనాక్షమ్మ అమ్మవారికి ఊంజలసేవ నిర్వహించాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ సూపరిటెండెంట్ ధర్మయ్య, నాగరాజు పాల్గొన్నారు. కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు సరస్వతి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. **సత్యవేడు:** సర్వమంగళా దేవి అమ్మవారు మహాచండి కాళికాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. **వరదయ్యపాళెం:** చెంగాళమ్మ వారు మహాచండి దేవీగా అంబూరులోని కామాక్షమ్మ అమ్మవానే మహాచండి కాళికాదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు.

ఓటర్ల జాబితా స్పష్టంగా ఉండాలి: కాంగ్రెస్

సత్యవేడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఫోటోలతో కూడిన స్పష్టమైన ఓటర్ల జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రఘునాథ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సత్యవేడులో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. బాలగురవం బాబు మాట్లాడుతూ బీజేపీ ఓట్ల చోరీ ద్వారానే మూడవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు బాలరాజ, తడ బాబు, మాణిక్యం, ఇళయరాజ, అంబేడ్కర్, భాస్కర్, శ్రీనివాస గౌడ్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



సత్యవేడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం పాఠశాల పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. 1986 - 1987 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన వారు 38 ఏళ్ళ తరువాత కలుసుకుని సందడి చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు పరంధామశెట్టి, వసంతమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, నియోజకవర్గ టీడీపీ ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ సొంత నిధులతో పాఠశాలప్రహరీ, గేటు నిర్మిస్తానన్నారు. కుప్పం ఎంపీడీవో ప్రేమ్ రాజ్‌కుమార్, వడమాలపేట ఎంఈవో తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు, ఆహార ధాన్యాలు, వ్యవసాయ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, రవాణా చార్జీలు తగ్గుతాయని, తద్వారా సామాన్య ప్రజలకు ఉపశమనం కలుగుతుందన్నారు.

శ్రీకాళహస్తి

సత్యవేడు

ముక్కంటి సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాల కృష్ణారావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కోర్టు న్యాయమూర్తులు శ్రీనివాసనాయక్, బేబీరాణీ, కోర్టు పర్యవేక్షకులు రవి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంకాళమ్మ పరమేశ్వరి జాతర



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంకాళమ్మ పరమేశ్వరి జాతర మహోత్సవం ఆదివారం ముగిసింది. అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో ఊరేగించారు. మహిళలు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్ అనంపురంలో అంకాలమ్మ పరమేశ్వరి అమ్మవారిని సత్యవేడు టీడీపీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కూరపాటి శంకర్‌రెడ్డి దర్శించుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, కన్నయ్యనాయుడు, నాయకులు పాల్గొన్నారు.

కళాసృష్టికి ప్రభుత్వ ప్రశంస



సీఎం చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న దశరథాచారి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కళాసృష్టి సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం ఎక్సెలెన్స్ అవార్డును అందజేసింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరుగుతున్న ప్రపంచ పర్యాటక దినోత్సవ సదస్సులో శనివారం సీఎం చంద్రబాబు చేతులమీదుగా కళాసృష్టి సంస్థ అధ్యక్షుడు, కొయ్యబొమ్మల కళాకారుడు డాక్టర్ జి.దశరథాచారి ఈ అవార్డు అందుకున్నారు. పలువురు ఆయన్ను అభినందించారు.

శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్‌కు పురస్కారం



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

సత్యవేడు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ థీమ్ బెస్ట్ రిసార్ట్ అవార్డును శ్రీసిటీ మ్యాంగో రిసార్ట్ అందుకుంది. ఇక్కడ అమలు చేస్తున్న స్థిరమైన, ఆకర్షణీయమైన ఆతిథ్య సేవలకు గాను ఈ గుర్తింపు దక్కింది. విజయవాడలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు, పర్యాటక శాఖ మంత్రి దుర్గేశ్‌ల నుంచి మ్యాంగో రిసార్ట్ తరఫున రిసార్ట్ .జనరల్ మేనేజర్ వై.శ్రీనివాసరావు అవార్డును స్వీకరించారు. శ్రీసిటీలోని సుందర విశాల ప్రాంతంలో ఉన్న మ్యాంగో రిసార్ట్ 20 లగ్జరీ కాటేజీలు, 10 సాధారణ గదులను కలిగి ఉంది. ఇక్కడ బస చేసే అతిథులు ప్రకృతితో పాటు కయాకింగ్, ట్రెక్కింగ్, సైక్లింగ్, పక్షులను వీక్షించి ఆనందాన్ని ఆస్వాదించవచ్చు.

కళత్తూరులో కుక్కల బెడద



కేవీబీపురం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): కళత్తూరులో కుక్కల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. వీధి వీధికీ సుమారు పది కుక్కలకుపైగా గుంపులుగా పాదాచారులు, ద్విచక్ర వాహన దారులపై దాడి చేస్తున్నాయి. రోజూ రెండు, మూడు కుక్కకాటు కేసులు ఆస్పత్రికి వస్తున్నాయి. పసి పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

జూనియర్‌పై దాడి ఘటనలో ఆరుగురు విద్యార్థుల సస్పెన్షన్

నారాయణవనం, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): ఒక ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీ హాస్టల్‌లో ఒక విద్యార్థిపై దాడికి పాల్పడిన ఆరుగురు సహచర విద్యార్థులను ఆ కాలేజీ యాజమాన్యం సస్పెండ్ చేసింది. ఆ విద్యార్థులను కళాశాల హాస్టల్ నుండి వారి తల్లిదండ్రులతో కలిపి పంపివేసినట్లు యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. తన స్నేహితురాలికి చనువుగా మెసేజ్‌లు చేస్తున్నాడని కళాశాల హాస్టల్‌లో ఉంటున్న అన్నమయ్య జిల్లాకు చెందిన విద్యార్థిని రూముకు రప్పించి దాడిచేసి, వీడియో రికార్డు చేసిన సంఘటన విదితమే. బాధిత విద్యార్థి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరుగురిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు.

సమాజ మార్పునకు శక్తి జాషువా సాహిత్యం

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంతో ప్రజల సమస్యలను వెలుగెత్తి చాటిన మహాకవి గుర్రం జాషువా అని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ మాజీ సభ్యులు ప్రసాద్ బాబు పేర్కొన్నారు. ఆదివారం జాషువా జయంతిని పురస్కరించుకుని గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాదిగ జనసైన్యం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్ మాదిగా, కాటయ్య, ప్రభు, అర్జున్, నరేష్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

- తహసీల్దారు ఆదేశాలతో కదిలిన అధికారులు



కొత్తవీరాపురం మోదుగులపాళెం మధ్య వంతెన వద్ద స్వర్ణముఖిలోకి వెళ్లకుండా తవ్వీత ట్రెంచ్

ఏర్పేడు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఇసుక అక్రమ రవాణాకు తహసీల్దార్ చెక్ పెట్టారు. వారం రోజులుగా కొత్తవీరాపురం, మోదుగులపాళెం, వికృతమాల తదితర గ్రామాల్లో కొందరు అక్రమార్కులు ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. స్వర్ణముఖి నదిలో గత ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు ఏకంగా రోడ్డునే ఏర్పాటు చేసుకుని ఇసుకను రాజమార్గంలో తరలించిన వైనం తెలిసిందే. రెండు నెలల క్రితం ఈ మార్గంలో వాహనాలు వెళ్లడానికి వీల్లేకుండా అధికారులు ట్రెంచ్ తవ్వారు. అయితే అక్రమార్కులు వారం రోజుల నుంచి మళ్లీ ఇసుకను తరలించేస్తున్నారు. శనివారం రాత్రి స్థానికులు గుర్తించి తహసీల్దారు భార్గవికి రైతులు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆమె ఆదేశాలతో కొత్తవీరాపురం వీఆర్వో శ్రీవిద్య, వీఆర్ఏలు జగదీష్, నాగరాజులు చేరుకుని అక్రమార్కులకు చెక్‌పెట్టారు. కొత్తవీరాపురం వద్ద ఎలాంటి వాహనాలు రాకపోకలకు జరపకుండా రోడ్డు తవ్వించారు. రైతులు రెవెన్యూ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



రక్తబీజాక్షరిగా జ్ఞానప్రసూనాంబ



మహాచండీగా పార్వతీదేవి



చండీదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి



మహాచండీగా దక్షిణ కాళికాదేవి



మీనాక్షిదేవిగా పొన్నాలమ్మ



సరస్వతిదేవిగా కరుమారియమ్మ

వర ప్రదాయినికి నీరాజనాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవమూర్తిని రక్తభీజాక్షరి బండాసురవధ అలంకారంలో ఊరేగించారు. ఆలయంలోని కనకదుర్గమ్మ మహాచండీదేవిగా,కనకాచలంపై కనకదుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. వేదాంలో దక్షిణకాళికాదేవి మహాచండిదేవి, బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి కళ్‌ఆళగర్ పెరుమాల్‌స్వామి అలంకారంలో, మహాచండీగా ముత్యాలమ్మ, మీనాక్షిదేవిగా బీవీ అగ్రహారం పెద్దగంగమ్మ, జ్ఞానప్రసూనాంబగా బీవీ అగ్రహారం చిన్నగంగమ్మ, మీనాక్షిదేవిగా పొన్నాలమ్మ, సరస్వతిదేవిగా బహదూరుపేట కరుమారియమ్మ దర్శన భాగ్యం కల్పించారు. తెట్టుప్రాంతంలోని నల్ల గంగమ్మ రాజరాజేశ్వరిదేవిగా, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు లలిత త్రిపురసుందరిగా, బహదూరుపేట కన్యకాపరమేశ్వరి అమ్మవారు గర్భరక్షాంబికాదేవి అలంకారంలో దర్శనిమచ్చారు. బంగారమ్మ అమ్మవారు, పానగల్‌లో గంగమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ,ముత్యాలమ్మగుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసలవీధిగంగమ్మ,శీతాలాంబ, త్రిశూలాంబ, సంతమైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. **ఏర్పేడు:** చిందేపల్లిలో పార్వతీదేవి మహాచండీదేవిగా గుడిమల్లంలో ఆనందవల్లి మహాచండీగా అనుగ్రహించారు. **పిచ్చాటూరు:** రజానగరం వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో చండీరాణి అవతారంలో వాసవీ కన్యకాపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. **నాగలాపురం:** పల్లికొండేశ్వర ఆలయంలో మరగదాంబిక అమ్మవారు శివలింగ పూజ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



శివలింగ రూపంలో మరగదాంబిక



జ్ఞానప్రసూనాంబగా చిన్నగంగమ్మ



మీనాక్షిదేవిగా పెద్దగంగమ్మ



మహాచండీగా ముత్యాలమ్మవారు



కాళరాత్రిగా బొమ్మల కొలువులోని అమ్మ



కాత్యాయనిదేవిగా కనకాచల కనకదుర్గమ్మ

కొయ్య బొమ్మల కళాకారులకు ప్రోత్సాహం



హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న పవన్ కృష్ణ, వంశీ కృష్ణ

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): కొయ్య బొమ్మల తయారీ కళాకారుల ప్రోత్సాహానికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వుడ్ బ్యాంకు ఏర్పాటుకు చొరవ తీసుకుంటున్నారని రాష్ట్ర చేనేత, హస్తకళల కార్పొరేషన్ ఛైర్మెన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం తొర్రూరులో చేనేత హస్తకళల పరిశ్రమను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వుడ్ సమస్యతో బొమ్మల తయారీ కళాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ క్రమంలో వుడ్ బ్యాంక్ ఏర్పాటుకు పవన్ చొరవ తీసుకుంటున్నారన్నారు. పవన్‌కృష్ణ, వంశీకృష్ణలు తల్లి చంద్రకళతో కలిసి కొయ్య బొమ్మల తయారీకి ప్రాణం పోస్తుండటం అభినందనీయం అన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మహేష్ రాయల్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ కుబేర హోమం




పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యాకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం లక్ష్మీ కుబేర హోమం నిర్వహించారు. 108 మంది దంపతులు ఇందులో పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

మళ్లీ టెండర్లపై నేడు కౌన్సిల్‌లో భేటీ

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 26(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో 11 అంశాలతో కూడిన అజెండాపై సోమవారం చర్చించనున్నారు. 2020-21లో కాంట్రాక్టర్ .తిరునావుక్కరసు రూ.35 లక్షల విలువైన 8 పనులకు దక్కించుకున్నా ఇప్పటికీ పూర్తిలేదు. అప్పట్లో డబ్బులు చెల్లించడం లేదని పనులు చేపట్టలేదని సమాచారం. సీసీ డ్రైన్ల నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రిల్లింగ్ పైప్‌ల పనులు నాలుగేళ్లుగా కదల్లేదు. ఆ పనులకు టెండర్లు నిర్వహించేందుకు అధికారులు ఇప్పుడు కౌన్సిల్ ఆమోదానికి పెట్టారు. కల్వర్టుల నిర్మాణం, జెండామాను వీధిలో పైప్‌లైన్ ఏర్పాటు, ఈఎల్ఆర్ఎస్‌లో క్లోరినేషన్ పనులకు టెండర్లను ఆమోదించనున్నారు. రూ.14.50 లక్షల మేర పనులకు టెండర్లు పిలిచేందుకు ఆమోదం తెలుపనున్నట్లు సమాచారం. పారిశుద్ధ్య పనుల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ, వాహనాలు, ఈ-ఆటోలు నిర్వహణ తదితరాల నిర్వహణకు రూ.25.49 లక్షల ప్రతిపాదనలు కౌన్సిల్ ఆమోదానికి ఉంచారు.

దుర్గాదేవి అలంకారంలో కన్యకాంబ



దుర్గగా వాసవీదేవి.



కామాక్షిగా ద్రౌపది

వడమాలపేట,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) :నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం దుర్గదేవి అంకారంలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు. **పుత్తూరు టౌన్:** పట్టణంలోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో అమ్మవారిని కామాక్షి దేవిగా, సదాశివేశ్వరస్వామి ఆలయంలో కామాక్షమ్మను కామాక్షిదేవిగా, రైల్వే క్వార్టర్స్ నాగాలమ్మ అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా, రాచపాలెంలో లక్ష్మీ కనకదుర్గమ్మ మహా చండీదేవిగా అలంకరించారు.

పుత్తూరు వార్తలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



వడమాలపేట,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదవ తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశమై గత స్మృతులను నెమరు వేసుకున్నారు. పాఠశాల ఆవరణ, ఆటస్థలంలో 50 ఎర్రచందనం మొక్కలను నాటారు. పూర్వపు పాధ్యాయులు విజయకుమారి, రమాదేవి, డేవిడ్, వెంకటచలపతి, భాస్కర్ రాజులను సన్మానించారు.

వార్డు పరిశుభ్రతకు శ్రీకారం

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 28(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో టీడీపీ 19వ వార్డు ఇన్‌చార్జ్ కృష్ణకుమార్ మన వార్డు పరిశుభ్రత - మన అందరి బాధ్యత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం వార్డు పరిధిలోని ఆర్టీసీ కాలనీ, ఏజీ కాలనీలలో ఉదయం 7 గంటల నుంచి పరిసరాలను శుభ్రపరిచారు. యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ నాయకుడు మోహన్‌కృష్ణ యువతకు టీషర్టులు అందజేశారు.